# సంస్కర్త

**★ లక్ష్మి ★**

"ఏం! హైమా! ఈ దినం ఇంత ప్రొద్దయిందే" "మాఆఫీసులో ఈ దినం విందు జరిగింది. దానికి ఉండక తప్పనది గాదు."

"ఏం, విందుకు ఉండకపోతే తిడ్తారా! ఎంత ఉద్యోగంవెలగబెడుతున్నా ఇల్లూవాకిలీ అనేది ఉండ నక్కఱలేదూ? అసలు వాళ్ళందరి మధ్య కూచోని తినకపోతే ఏం? అవునులే........"

"అదేమిటండి అలాగంటారు, అందరూ పోతూవుంటె నేనొక్కదాన్ని తిరిగి వస్తే ఏమనుకుంటారు? తర్వాత ఏమైన సందుదొరకితే మాటంటారు: మీకిష్టంలేదని చెప్పకూడదూ, ఇన్నిమాటలనడందేనికి?"

"అవునులే. మాట లంటాను, తిడ్తాను, కొడ్తాను. ఇంకా అను, నీకు ఏకోశానైన్నా కృతజ్ఞత అనేదిఉంటేగదూ, అట్టే మొగ వాళ్ళతోతిరగొద్దొన్నాగాని నీవిలా బదులుకు బదులు చెప్పుతూ ఉంటే నాకెందు కొచ్చింది. నేనే అరవిందాశ్రమంలోనో చేరిపోతాను."

"ఇదేమిటండి? ఊరికే నన్న స్తమానమూ ఏడిప్పిస్తారు. వద్దంటే రేపటినుండి మానేస్తా అంతేగాని ఉద్యోగం అని చేరింతర్వాత మగవాళ్ళతో మాట్లాడకుండా జరుగుతుందా—"

"జరుగుతుందా! ఎందుకు జరుగుతుంది? నా కన్నీ తెలుసులే. అయింది చాలుగాని లోపలికెళ్ళి ఇకనైనా పొయ్యిలో పిల్లిని లేవగొట్టు" అని రామం గబ గబా తన రూము లోనికి వెళ్ళిపోయినాడు.

హైమ గుడ్లనీరు గుక్కుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఇంట్లో దినం ఇదేతంతు. దేనికో ఓదానికి రామం హైమను దెప్పుతూనే ఉంటాడు. మొదటంతా హైమ ఏమి జవాబిచ్చేది గాదు. గాని ఇప్పుడు మరీప్రాణం విసిగిపోయి ఊరకుండలేక జవాబు చెప్తాంది.

రామం పెద్దసంస్కర్త అని పేరు తెచ్చుకున్నాడు. కాలేజీ చదివేరోజులలోనుండి అతడు వితంతు వివాహములను గురించి, స్త్రీవిద్యను గురించి లెక్చర్లు దంచేవాడు. స్నేహితులందరూ అతని ఆశయాలూ అదీ చూచి విస్తుబోయేవారు, ఒకసారి ఏదో మాటల్లో "నేను పెండ్లి చేసుకుంటే విధవనే చేసుకుంటాను" అన్నాడు

"చాల్లేవోయ్! చెప్పావు గాని. అందరూ ఇలా అనేవాళే. చేసిచూపించిన వాళ్ళులేరు. నీవేం గొప్పా?" అన్నాడు మిత్రుడొకడు

తనసంగతి చూడమన్నాడు రామం.

కాలం గడచిపోయినది. రామం తన అభిలాష ప్రకారమే వితంతు ఆశ్రమంలో ఉన్న హైమను చేసుకున్నాడు, సంఘమెంతో హర్షించినది.

హైమ.... పాపం! చిన్నప్పుడే పెండ్లి అయి ఒక ఆర్నెల్లయినా పట్టుమని కాపరం చేయలేదు. విధి ఆమెను ఓరకంటితో చూచినది. మూన్నాళ్ళ జ్వరంతో ముక్కు మూసుకున్నాడుఆమె భర్త. అప్పటినుండి ఆమెను దగ్గరకు తీసినవారులేక నానా అవస్థలుపడి అఖరుకు వితంతు ఆశ్రమంలో చేరినది, అక్కడ ఆవార్డెన్ లదగ్గర ఇతరులదగ్గర

నానా కష్టాలు పడుతూ కాలంగడిపినది. ఆసమయంలో రామం ఏదో యాదాలాపంగా ఒకస్నేహితునితో గూడ విజిట్ చేసే దానికి వచ్చినాడు. హైమ చూడటానికి చక్కగా వుంటుంది రామం ఆమెను చేసుకుంటా నన్నాడు, మాట అనడమే తరువాయి పెండ్లి బ్రహ్మసమాజ పద్ధతులలో జరిగిపోయినది.

రామం బొంబాయిలో కాపరం పెట్టాడు. హైమనిగూడ ఉద్యోగంలో చేర్చినాడు. అన్నీ గొప్ప ఆశయాలే. స్త్రీసంస్కరణ- అన్నీ కావలసినవే కుక్కతోక వంకరఅన్నట్లు మానవసహజమగు మాత్సర్యమతనిని వదలలేదు. హైమ మొదటి భర్తను గూర్చి అతనికెన్నో ఆలోచనలు పోయేవి. అతనెలాగుండేవాడు? హైమను బాగా చూచుకునేవాడా? హైమ కతనంటే చాలాప్రేమేమో? అని అతనికి వివిధ ఆలోచనలు పోయేవి. గృహ విషయకంగా ఏమైనా చిరాకుగా ఉండినా ఆమెకు మొదటి భర్తమీది ప్రేమచేతనేమో ఆలాగున్నది. తానంటే ఇష్టములేదేమో అనుకునే వాడు "పాడు స్వార్ధములు అనుమానాలూ" అన్నట్లు ఈ అనుమానాలకు తోడుస్వార్ధంకూడా ఎక్కువై పోయినది. ఎన్నడైనా పొరపాటునసైనా హైమ వాళ్ళ ఆఫీసుసంగతులు చెప్తే అతనికి కళుక్కుమనేది. హైమ వాళ్ళందరితో నవ్వుతూ ఖులాసాగా కబుర్లుచెపుతున్నట్లు ఊహించుకొని బాధ పడ్తాడు ఎందుకై. అఉద్యోగంలో చెర్చాను అనుకుంటుదేవాడు. కాని.... నెలకు రెండువందల రూపాయలు ఊరికే వస్తాయా ఇద్దరిజీతంతో ఎంతో దర్జాగా కాలం గడుపుకుంటూ ఉన్నారు, కాని ఆమానసికబాధను సహించలేక పోయేవాడు, ఏదోవిధంగా తన అక్కసును వెళ్ళగ్రక్కేవాడు.

ఒకనాడు పని అంతా అయి హైమ హాలులోనికి వచ్చింది. రామం సోఫాలోనే కూర్చుని ఉన్నాడు.

"ఏమండీ! ఇంకా పండుకోలేదా'' అన్నది,

"లేదు హైమా! ఏదోనిద్రరాలేదు. ఇలావచ్చి కూర్చో" అన్నాడు రామం. హైమ తలవంచుకుని కూర్చుంది-కొంచంసేపు విశ్శబ్దం,

"హైమా!.... నేనొక సంగతడుగుతాను చెప్తావా" "చెప్పండి"

"మరి మీ ఆయనెలాగుండేవారు? నీవంటే ప్రేమనా''

''ఇప్పుడెందు కండీ ఆ సంగతులు. ఇదివరకెన్ని సారులడిగేరు"

"ఆదగో! దానికే నాకుకోపంవచ్చేది. అడిగిందానికి సమాధానం చెప్తే ఏం? అవునులే ఆయనలాగా నేనందంగా ఉన్నానా! అసలెందుకు నీ కర్మచాలక నేనునీకు దొరికాను. అంతేగదూ?"

"అదేమిటండీ అలా సంబంధం లేకుండా మాట్లాడుతారు నే నలా గన్నానా?"

"నీ వనా లేమిటి? అడిగిందానికి చెప్పక పోవటమూ ముభావంగా ఉండటమూ ఇదే చెప్తున్నాయి. అసలు నేనంటేనే నీ కిష్టంలేదులే. మీ ఆఫీసులో ఉన్నారే భాస్కరం, సత్యం వాళ్ళ లాంటి వాళ్ళయితే బాగుండేది. సినిమాలకు తీసికెళ్ళేవాళ్లు, సరదామనుష్యులని నీవే అన్నావు గదూ."

"నన్నెందుకండీ ఇలా [illegible]పెడతారు? ప్రతి మాటకూ పెడర్ధాలే. ఏదో సరదాగా ఉంటారంటే మీ రంటే నా కిష్టంలేదనా....." అని హైమ సోఫామీదపడి వెక్కివెక్కి ఏడ్వసాగింది, రామం మెదలకుండా వెళ్ళి పండుకున్నాడు.

ప్రతిదినం ఇంతే, దేనికో ఓదానికి రామం పేచీ పెట్టడం. హైమ ఏడ్వటం. హైమ రామంను చేసుకున్న క్రొత్తలో ఎన్నో కలలు గన్నది. పెద్ద సంస్కర్త అని పేరుబొందినవాడు కోరి తనను చేసుకుంటూన్నాడు. తన జీవితమెంతో కుదుటపడుతుం దనుకుంది. కాని ఆశ

లన్నీ నిరాశలయినాయి. రామం అసూయాపరుడైనాడు. ఇతరులతో మాట్లాడితే కోపం, ఇతరులను గురించి మాట్లాడితే తాపం, హైమ పని రోటిలో తలదూర్చిన ట్లయింది. ఇతని మాటలు పడలేక ఉద్యోగాన్ని రిజైను చెయ్యాలనుకుంది. కాని రామం ఒప్పుకోలేదు. తన పూర్వపు పంథా విడువలేదు. ఎప్పుడూ హైమ మొదటి భర్తనుగూర్చి ప్రశ్నించేవాడు. పాపం! హైమ ...! రామాన్నే తన దైవంగా చూసుకుంది. ఆపద్బాంధవు డనుకుంది. తనపాలిట దేవు డనుకుంది. కాని రామం ఆపదృత్రువయి కూర్చున్నాడు ఎప్పుడూ సూటిపోటి మాటలతో హైమను బాధించేవాడు. హైమకు ఇల్లే నరకమనిపించింది

ఇప్పుడు కొంతకాలంగా మండిపడటం ఎక్కువయిపోయింది. ఈదినం టీపార్టీకుండిన దని ఇంత తూలనాడినాడు. హైమ హృదయం వ్రక్కలయిపోయింది ఏడ్చి. కాని తప్పుతుందా అలాగే పనంతా ముగించుకొని రామాన్ని భోజనానికి పిలిచింది. మౌనంగా భోంచేసి వెళ్ళిపోయాడు. హైమకు అన్నమే సయించలేదు. మెల్లగా వెళ్ళి పడుకున్నది. రామం మళ్ళీ నస మొదలుపెట్టాడు. 'మాటంటే ఇంతరోషం! అంతేలే పెద్తే తింటారుగాని మాటంటేపడరు. తెలుసుకోవాలని అడిగితే ఇంత అఘాయిత్యమా. ఏమాత్రమయినా కృతజ్ఞత అనేది ఉండేగదూ, నేను ని న్నెలాంటి కూపంలోనుండి రక్షించాను. ఇంకొకరైతే ఎంత ఇదిగా ఉండేవాళ్ళు...." ఈ వరసన మొదలుపెట్టాడు. హైమ వినలేకపోయింది. మొగాన చెంగుకప్పుకొని వెక్కి వెక్కి ఏడ్వటం మొదలుపెట్టింది. ఏడ్పే ఆమెకు కొంచెం హృదయశాంతి నిచ్చేది. కొంచెం సేపటికి రామం నిద్రపోయాడు. కాని రూములో హైమ లైటువేసినందువలన మెలకువ వచ్చినది కాని లేవలేదు. మరల నిద్రలోనే మునిగిపోయాడు.

ప్రొద్దున లేచేటప్పటికి బాగా ప్రొద్దెక్కింది. హైమ పడకమీద లేదు. నేరుగా వంటింట్లోకి పోయినాడు. అక్కడ హైమలేదు. అక్కడ తచ్చాడుతూన్న పిల్లిరామంని చూచి బెదరి పరుగెత్తింది. వెనక్కు తిరిగాడు. హైమ రూములోనికి పోయాడు. అచేతనంగా హైమ శరీరం మాత్రం అక్కడ పడివున్నది.

రామం ముఖాన నెత్తురుచుక్కలేదు. నిలువునా నీరై పోయాడు. ఒక్కక్షణంకూడా అక్కడ ఉండలేకపోయాడు. ఆగది తనవైపు జరుగుతూన్నట్టు తన చుట్టూసమాధిలా ఏర్పడుతూన్నట్టు అనిపించింది. ఆమెచేతిలో ఉన్న ఉత్తరం తనని వెక్కిరిస్తూన్నట్టుంది. ఘోరపరాజయాన్ని సూచిస్తూన్నట్టుంది. హడలిపోయాడు. వణుకుతూన్న చేతులతో ఆ ఉత్తరాన్ని తీసుకున్నాడు- ఉత్తరంవిప్పలేదు. ముక్కలు ముక్కలుగా చించి గదినిండా వెదజల్లేశాడు.

